హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 21.0

అవకాశం వచ్చిందని సర్దేశారు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న చోట ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని విద్యాశాఖ సంకల్పించింది. అందుకు అనుగుణంగా విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డీఈవోలకు అవకాశం ఇచ్చింది. సర్దుబాటు విషయంలో విద్యాశాఖ కొన్ని నిబంధనలు విధించగా, వచ్చిన అవకాశాన్ని వినియోగించుకునేందుకు కొందరు ఎంఈవోలు నిబంధనలు తోసిరాజని అక్రమ డిప్యుటేషన్లకు తెరలేపారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)/భానుపురి, భువనగిరి టౌన్

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు

కలెక్టర్ ఉత్తర్వులున్నా రిలీవ్ చేయని వైనం

విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖాధికారులు డిప్యుటేషన్ కేటాయించారు. అందుకు భిన్నంగా మండలాల్లో ఎంఈవోలు అక్రమ డిప్యుటేషన్లు కేటాయించారు. అర్హులైనవారికి, ఆర్డర్ పొందినవారిని కాదని, అనర్హులకు, వారికి అనుకూలమైన వారికి డిప్యుటేషన్లు కేటాయించినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా రూపొందించిన డిప్యుటేషన్ విధానాన్ని తప్పుదారి పట్టించేలా వ్యవహరించిన తీరుపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మచ్చుకు కొన్ని

» నల్లగొండ జిల్లా, నల్లగొండ మండలంలో ఓ ఎస్జీటీ ఉపాధ్యాయురాలిని ఇతర పాఠశాలకు డిప్యుటేషన్ ఇవ్వాల్సి ఉండగా, ఆమెకు ఎంఈవో ఉత్తర్వులు ఇవ్వడం లేదు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఓ మండలంలో రెండు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా పరస్పర బదిలీచేశారు.

ఇదే మండలంలో మరో ఉపాధ్యాయురాలికి డిప్యుటేషన్ ఉత్తర్వులున్నా ఆమెను రిలీవ్ చేయడం లేదు. దేవరకొండ నియోజకవర్గం, కొండమల్లేపల్లి మండలంలోని రామావత్‌తండా ప్రాథమిక పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులు ఉండగా, ఒకే ఉపాధ్యాయుడున్నారు. ఇక్కడ నాణ్యమైన విద్య కోసం మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని యూటీఎఫ్ నాయకులు విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ మరొకరిని కేటాయించకపోతే పాఠశాల మూతపడే పరిస్థితి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

» సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల్లో సుమారు 100 నుంచి 200 మంది వరకు ఉపాధ్యాయులు డిప్యుటేషన్లలో ఉన్నట్టు సమాచారం. అయితే విద్యాశాఖ అధికారులు మాత్రం కేవలం 90 నుంచి 100 మాత్రమే ఉన్నారని చెబుతుండడం గమనార్హం. తుంగతుర్తి మండలంలోని చాకలిగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయురాలిని సూర్యాపేట మండలంలోని ఓ పాఠశాలకు పంపారు. ఇదే మండలంలోని ఎంపీపీఎస్ బండరామారంలో పని చేసే ఎస్జీటీని నియోజకవర్గంతో సంబంధంలేని, జిల్లా సరిహద్దు మండలం నడిగూడెం మండలానికి డిప్యుటేషన్‌పై పంపారు. వెంపటి జడ్పీహెచ్ఎస్‌లో పని చేసే ఓ ఉపాధ్యాయుడిని కోదాడ నియోజకవర్గానికి డిప్యుటేషన్‌పై పంపారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని బోజ్యాతండాలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడిని సూర్యాపేట పట్టణంలోని కుప్పిరెడ్డిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపడం గమనార్హం.

» యాదాద్రి జిల్లాలో 25కు పైగా అక్రమ డిప్యుటేషన్లు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ఒక్క తుర్కపల్లి మండలంలో 10కి పైగా అక్రమ డిప్యుటేషన్లు ఉన్నట్టు వినికిడి. గోగులుతండా ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపారు. కరిషాలగడ్డ తండాలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలిని మౌఖిక ఆదేశాలతో పోచంపల్లి మండలానికి పంపారు. ఎంపీపీఎస్ మల్కాపురం నుంచి ఓ ఉపాధ్యాయురాలిని చౌటుప్పల్ మండలానికి పంపారు. యూపీఎస్ కొండాపూర్ నుంచి ఒకరిని చౌటుప్పల్‌కు, మరొకరిని ఇంకో పాఠశాలకు పంపి, ఎస్జీటీని శ్రీనివాసపురం పాఠశాలకు పంపారు. యూపీఎస్ కొండాపూర్ నుంచి ఎస్జీటీని శ్రీనివాసపురం పంపించి, ఇక్కడి నుంచి ఒకరిని కొండాపూర్‌కు పంపడం గమనార్హం. శ్రీనివాసపురంలోని మరో ఎస్జీటీని ఎంపీపీఎస్ గంధమల్లకు పంపారు. ఇక ఎస్ఆర్‌జీ పేరుతో కొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు విధులకు హాజరు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలకు తూట్లు

నల్లగొండ జిల్లాలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు, మరోవైపు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు వీలుగా కలెక్టర్ అనుమతితో రెండు రకాలుగా డిప్యుటేషన్ ఉత్తర్వులు ఇచ్చారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో విద్యార్థులున్న, ఉపాధ్యాయులు లేని చోట బోధనకు ఇబ్బందిలేకుండా ఉండేందుకు వీలుగా పిల్లలు లేని పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను, విద్యార్థులున్న పాఠశాలలకు మార్చేందుకు అనుమతించారు. ఎస్జీటీ ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సర్దుబాటు చేయాలి. స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలో అదనంగా ఉపాధ్యాయులుంటే మండల పరిధిలో ఇతర పాఠశాలలకు పంపాలి. స్కూల్‌అసిస్టెంట్లను నియోజకవర్గం స్థాయిలో పాఠశాలల్లో సర్దుబాటు చేయాలి. ఇతర పాఠశాలలకు డిప్యుటేషన్‌పై వెళ్లేందుకు తొలుత సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వాలి. వారు కాదన్న పక్షంలో మాత్రమే జూనియర్ ఉపాధ్యాయులను పంపిన చోటికి తప్పకుండా వెళ్లేలా నిబంధనలు రూపొందించారు. ఈ మేరకు 22 మందిస్కూల్ అసిస్టెంట్లకు డిప్యుటేషన్ ఉత్తర్వులిచ్చారు. అయితే ఎస్జీటీల విషయంలో మాత్రం కొన్ని మండలాల్లో ఎంఈవోలు జిల్లా అధికారులు రూపొందించిన నిబంధనలను అతిక్రమించి వారికి నచ్చినరీతిలో డిప్యుటేషన్లు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపాలి



ఉపాధ్యాయుల డిప్యుటేషన్లపై కలెక్టర్ సూచనలతో డీఈవో రూపొందించిన నిబంధనలను కొందరు ఎంఈవోలు ఇష్టారీతిన దుర్వినియోగం చేస్తున్నారు. వారికి అనుకూలమైన వారికోసం నిబంధనలను తుంగలో తొక్కి ఉత్తర్వులు ఇవ్వడం అన్యాయం. పిల్లల్లేని పాఠశాలల ఉపాధ్యాయులను, విద్యార్థులున్న చోటికి పంపాలి. కలెక్టర్ ద్వారా డిప్యుటేషన్ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులను తక్షణం రిలీవ్ చేయాలి.

- పెరుమాళ్ల వెంకటేశం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

స్పష్టమైన వివరాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



డిప్యుటేషన్ ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో ఎక్కడ ఏ ఎంఈవో ఉల్లంఘించారో? ఏ ఉపాధ్యాయుడికి అన్యాయం జరిగిందనే అంశంలో స్పష్టమైన వివరాలు అందజేస్తే చర్యలు తీసుకుంటాం. డిప్యుటేషన్ల విషయంలో కలెక్టర్ ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడ్డట్టు తేలితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

- బి.భిక్షపతి, నల్లగొండ జిల్లా విద్యాశాఖాధికారి

మండలాల పరిధిలో సర్దుబాటు చేశారు

కాంప్లెక్స్, మండలం పరిధిలోనే ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులను ఉన్నతపాఠశాలలో సబ్జెక్ట్ వారీగా కొరతగా ఉన్న చోట సర్దుబాటు చేశాం. జిల్లాలో 100 లోపు ఉపాధ్యాయులను మాత్రమే సర్దుబాటు చేశాం. డిప్యుటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులు జూన్ నుంచి వారి పూర్వ పాఠశాలకు వెళ్తారు.

- అశోక్, సూర్యాపేట జిల్లా విద్యాశాఖాధికారి

నేటి నుంచే రామలింగేశ్వరుడి జాతర

» ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు » గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభం

» చెర్వుగట్టుకు నేడు మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వేముల రాక



నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15: నల్లగొండ జిల్లాలో శైవక్షేత్రం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మొత్తం ఐదు రోజులపాటు వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే 14న నల్లగొండలో స్వామివారి నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించి ఉత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకలను తిలకించేందుకు జిల్లానుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భారీ సంఖ్య లో భక్తులు తరలిరానున్నారు. వారం రోజులపాటు కొనసాగే స్వామి వారి ఉత్సవాల్లో ప్రధానంగా కల్యాణోత్సవం, అగ్ని గుండాల మహోత్సవానికి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి ఇబ్బందిపడకుండా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవ ప్రారంభానికి మంత్రి రాక

పార్వతీ జడల రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలను ప్రారంభించేందుకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం రానున్నారు. ఆలయ మహామండపంలో ఉత్సవ యాజ్ఞికులు సుబ్రహ్మణ్య దీక్షితులు, ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గణపతి పూజలో పాల్గొని వారు ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

రథసప్తమి ప్రత్యేకత

రథసప్తమి రోజున పార్వతీ జడల రామలింగేశ్వరుల కల్యాణం నిర్వహించడం చెర్వుగట్టు క్షేత్ర ప్రత్యేకత. దేశంలోని ఏశివాలయంలోనైనా మహాశివరాత్రి పర్వదినాన శివపార్వతుల కల్యాణం నిర్వహించడం సంప్రదాయం. కానీ ఒక్క చెర్వుగట్టు క్షేత్రంలోనే రథసప్తమి రోజున నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

తలంబ్రాలు సమర్పణ

రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే ఉత్సవ విశేష కార్యక్రమాల్లో స్వామి వారి కల్యాణోత్సవం చూడటానికి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ఒకవేళ కల్యాణం చూడటానికి అవకాశం దొరకకపోయినా తలంబ్రాల బియ్యం స్వామివారికి సమర్పించడం కూడా ఇక్కడి సంప్రదాయం. భక్తులు సమర్పించిన బియ్యాన్ని దేవస్థానం అధికారులు టెండర్ ద్వారా విక్రయించి ఆలయానికి ఆదాయాన్ని సమకూరుస్తారు.

మూడు విడతలుగా

ఉత్సవాలు ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు మూడు విడతలుగా విధులు నిర్వర్తించనున్నారు. పంచాయతీరాజ్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రిసిటీ, ఫైర్, ఎండోమెంట్, వైద్యారోగ్య శాఖలు మూడు విడతలుగా 24గంటలపాటు భక్తులకు సేవలందించనున్నారు. పంచాయతీరాజ్ సిబ్బంది 450మంది, దేవాదాయశాఖ సిబ్బంది 106మంది, పోలీస్‌శాఖ నుంచి 814మంది విధుల్లో పాల్గొననున్నారు.

నల్లగొండ రీజియన్ పరిధిలో 30 ప్రత్యేక బస్సులు

ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకోసం నల్లగొండ రీజియన్ పరిధిలో 30 ఆర్టీ సీ బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. రీజియన్ పరిధిలోని నల్లగొండ, నార్కట్‌పల్లి, దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, యాదగిరిగుట్ట డిపోల నుంచి జాతరకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. చెర్వుగట్టుకు వాహనాల్లో వచ్చే భక్తుల కోసం మూడు చోట్ల పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు. ఎల్లారెడ్డిగూడెం-చెర్వుగట్టుకు దారిలో, నార్కట్‌పల్లి-నల్లగొండకు వెళ్లే దారిలో నల్లచెర్వు కట్ట రోడ్డు వెంట, ఏపీలింగోటం-గుమ్మళ్లబావి నుంచి వచ్చే దారిలో పార్కింగ్‌కు స్థలం కేటాయించారు.

ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు

ఎస్పీ రాహుల్‌హెగ్డే



క్యూలైన్లు, ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని ఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు, జాతర ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8 నుంచి నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. పార్కింగ్ స్థలాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదికలు, ఎడ్ల పందేలు, ఇతర క్రీడా పోటీలు నిర్వహించే స్థలాలు, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నందున, ఆరు చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేస్తామని, భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీరు, ఫైర్, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రిస్తామని, ప్రభల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తామన్నారు. పోలీస్‌కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, 700 మంది సిబ్బందితో పాటు సీసీకెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. అంతకముందు ఆలయంలో ప్రత్యేక పూజల్లో ఎస్పీ పాల్గొన్నారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, కోదాడ సీఐ రజితారెడ్డి, ఎస్ఐ పరమేష్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ సురేష్ తదితరులు, ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రూ. 1 కోటి మంజూరు

హుజూర్‌నగర్, మేళ్లచెర్వు: మేళ్లచెర్వులోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి జాతర సందర్భంగా ఏర్పాట్ల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోటి రూపాయల నిధులు మంజూరు చేయించారు. గురువారం జీవో నెం.38 ద్వారా ఎస్‌జీఎఫ్ నిధులు కోటి రూపాయలు మంజూరు చేస్తూ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ మహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీచేశారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 15: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-2 ఐజీ సుధీర్‌బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న వై.సురేందర్‌రెడ్డిని సూర్యాపేట రూరల్ సర్కిల్‌కు, ఇక్కడ పనిచేస్తున్న వై.అశోక్‌రెడ్డిని ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. తుంగతుర్తి సీఐ బ్రహ్మమురారిని నల్లగొండ సీసీఎస్‌కు, ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న డి.శ్రీనివాస్‌ను తుంగతుర్తికి బదిలీ చేశారు. ఇదిలా ఉండగా, సూర్యాపేట డీఎస్పీ జి.రవి గురువారం బాధ్యతలు తీసుకున్నారు.

గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలి



ఇమాంపేట గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో సురేష్‌కుమార్

సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 15: గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇమాంపేట గ్రామాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీని తనిఖీచేసి ఏ మొక్కలు పెంచుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎండకాలం దృష్ట్యా మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించి హరితహారానికి సిద్ధం చేయాలని సూచించారు. అదేవిదంగా పంచాయతీ రికార్డులను తనిఖీచేశారు. అనంతరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, సీడీపీవో కిరణ్మయి, పంచాయతీ కార్యదర్శి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేట బడ్జెట్ రూ.87 కోట్లు

ఆమోదించిన మునిసిపల్ కార్యవర్గం

వాడివేడిగా మునిసిపల్ బడ్జెట్ సమావేశాలు



సమావేశానికి హాజరైన కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 15: సూర్యాపేట మునిసిపాలిటీలో ఆర్థిక సంవత్సరానికి 2024-25 బడ్జెట్‌ను రూ.87,05,50,000తో ఆమోదించారు. బడ్జెట్ సమావేశం గురువారం మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో మునిసిపల్ సాధారణ నిధుల ద్వారా రూ.39.50కోట్లు, డిపాజిట్‌లు, రుణాల పద్దుల కింద రూ.4.05కోట్లు, వివిధ గ్రాంట్‌ల ద్వారా రూ.43.50కోట్లు వస్తాయని అంచనా వేశారు. ఉద్యోగులు, సిబ్బంది వేతనాలకు రూ.14.50లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.398లక్షలు, విద్యుత్‌చార్జీల కింద రూ.299లక్షలు, రుణాలు, విద్యుత్ చెల్లింపులు రూ.200లక్షలు, గ్రీన్ బడ్జెట్ కింద రూ.395.05లక్షలు కేటాయించారు.

అంతేకాకుండా, ఇంజనీరింగ్ విభాగం నిర్వహణకు రూ.342లక్షలు, సాధారణ పరిపాలన వ్యయంకింద రూ.63లక్షలు, పట్టణ ప్రణాళిక విభాగం ఖర్చు రూ.30లక్షలు కేటాయించారు. విలీన గ్రామాల్లో వివిధ అభివృ ద్ధి పనులకు రూ.224లక్షలు, ప్రజాసౌకర్యాల పద్దు కింద రూ.82లక్షలు, వివిధ అభివృద్ధి పనుల కింద రూ.367.45లక్షలు కేటాయించారు. 2023-24 ఆర్థిక సంవత్సర సవరించిన బడ్జెట్ ఆదాయం రూ.104.04కోట్లుగా ఆమోదించారు.

వాడివేడిగా చర్చలు

మునిసిపల్ సమావేశంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు ఆయా సమస్యలపై గళమెత్తారు. గతంలో కేటాయించిన బడ్జెట్ పూర్తిస్థాయిలో కేటాయించలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా 41వార్డు కౌన్సిలర్ షఫిఉల్లా మాట్లాడుతూ అన్నపూర్ణ పథకంకు బడ్జెట్‌లో రూ.5లక్షలు కేటాయించారని, మరింత పెంచాలని సూచించారు. 32వవార్డు కౌన్సిలర్ జహీర్ మాట్లాడుతూ వార్డులో గత బడ్జెట్‌లో కేటాయించిన డ్రైనేజీ నిర్మాణ నిధులు నేటికీ వినియోగించకపోవడంతో డ్రైనేజీలు ఏర్పాటు కాలేదన్నారు. ఇదిలా ఉంటే మునిసిపల్ బడ్జెట్ సమావేశం ప్రారంభంలో మీడియాను సమావేశ మందిరంలోకి రానివ్వాలని కాంగ్రెస్ కౌన్సిలర్‌లు ఆందోళనకు దిగారు.

అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

పేట అభివృద్ధిలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మునిసిపల్ బడ్జెట్ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంకతో కలిసి పాల్గొని మాట్లాడారు. అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోయేలా బడ్జెట్ రూపొందించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేలా బడ్జెట్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఈఈ జీకేడీ ప్రసాద్, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్టకిశోర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్‌లు

తాగునీటికి ప్రాధాన్యం

బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్మన్

నేరేడుచర్ల: నేరేడుచర్ల పట్టణంలో తాగునీటి సరఫరాకు, పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ తెలిపారు. గురువారం నేరేడుచర్ల మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను ఆయన ప్రవేశపెట్టారు. 2024-25 అంచనా వ్యయం రూ.24,17,90,000 కాగా సాధారణ పరిపాలన సిబ్బంది జీతభత్యాల కేటాయింపుల తర్వాత ఇంజనీరింగ్, నీటి సరఫరా, పారిశుధ్యం, ప్రజా ఆరోగ్య కార్మికులకై రూ.20.10కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. రూ.49లక్షలు గ్రీన్ బడ్జెట్‌కు కేటాయించామని, సాధారణ పరిపాలన సిబ్బంది జీతభత్యాలకు రూ.1.35కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మునిసిపాలిటీకి సాధారణ ఆదాయం రూ.1.58 కోట్లు, మార్కెట్ ఫీజు, కుళాయి పన్నులు, లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.31.10లక్షలు ఇతర ఆదాయాల ద్వారా రూ.19.98 కోట్ల ఆదాయం లభించినట్లు తెలిపారు.

రాబోయే వేసవిలో పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కౌన్సిల్ సభ్యులందరూ ఏకవాక్యంతో బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కమీషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు జితేందర్‌రెడ్డి, నాగవేణి, లలిత, సులోచన, నాగయ్య, సరిత, బాష, షహనాజ్, మేనేజర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం ఆగదు

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టినా ప్రజల ఆశయాలను, సమస్యలు తీర్చేందుకు ఆమ్‌ఆద్మీ పార్టీ పోరాటం ఆపదని రాష్ట్ర ఇన్‌చార్జి కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామరాజ్యం అంటే దేవాలయాలు కట్టించడం కాదని, ఉచిత విద్య, వైద్యం అందించడమే నిజమైన రామరాజ్యమన్నా రు. ఢిల్లీలో సీఎం కేజ్రీవాల్‌ను అణగదొక్కేందుకు ప్రధాని నరేంద్రమోదీ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 5,200 మం దిపై కేంద్ర ప్రభుత్వం కేసులు నమోదు చేయగా, కేవలం 22 మాత్రమే తీర్పులు వచ్చాయన్నారు. కేసులు ఉన్న వారు బీజేపీలో చేరిన మరుక్షణమే వాటిని ఎత్తివేస్తున్నారని ఆరోపించారు. మతం పేరు తో రాజకీయాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధిచెప్పాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చిన్న రాష్ట్రాల విభజన జరగాలని ఆమ్‌ఆద్మీ మద్దతిచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యుడు బుర్ర రాముగౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సూరారపు పరీక్షన్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య, కుతుబుద్దీన్, జూలూరీ మమత, శ్రీను, శివాజీ, అనూష, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కట్టంగూరు, ఫిబ్రవరి 15: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండల కేంద్రంలోని అంబటివాగులో గురువారం చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబటివాగుకు చెందిన వద్ది మల్లేష్ తన రోజు వారి కార్యక్రమంలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'దళితబంధు'లో రూ.100 కోట్ల అవినీతి

● నా వద్దకు 70 ఫిర్యాదులు వచ్చాయి ● విచారణ జరిపించాలి ● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ డిమాండ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న సామేల్

మోత్కూరు, ఫిబ్రవరి 15: తుంగతుర్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఇచ్చిన దళిత బంధులో సుమారు రూ.100కోట్ల అవినీతి జరిగిందని, దానిపై సమగ్ర విచారణ జరిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అసెంబ్లీలో డిమాండ్‌చేశారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. 'దళితబంధు'లో అవినీతి జరిగిందనడానికి తన వద్దకు 70 ఫిర్యాదులు వచ్చాయన్నారు. నియోజకవర్గానికి తిరుమలగిరి గుండెకాయలాంటిదని, సుమారు 30ఏళ్లుగా పోరాడుతున్నా అక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదన్నారు. తాను ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లగా జూనియర్ కళాశాల ఇస్తామన్నారని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ ఉన్న పాలీటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసి బీటెక్ (ఇంజనీరింగ్ కళాశాల) ఏర్పాటు చేయాలన్నారు. తుంగతుర్తి మండలంలోని రుద్రమ చెరువును రిజర్వాయర్ చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చి నెరవేర్చలేదని, మన ప్రభుత్వం రుద్రమ చెరువును రిజర్వాయర్ చేయడానికి సహకరించాలన్నారు. మోత్కూరు చుట్టూ నాలుగు మండలాలకు కూడలి కేంద్రమని, అక్కడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్‌డిపో, పోస్టుమార్టమ్ కేంద్రంతో కూడిన 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. పోస్టుమార్టమ్ కోసం సుమారు 80 కిలోమీటర్ల వెళ్లాల్సి వస్తుందన్నారు. తుంగతుర్తి నియోజక వర్గం చాలా వెనుకబడి ఉందన్నారు. తుంగతుర్తిలో 135ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ (చిన్న పరిశ్రమలు) ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో రోడ్లు కంకర తేలి చాలా అధ్వానంగా ఉన్నాయని, కనీసం 300 కిలోమీటర్ల రోడ్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

వివక్షలేని సమాజన్ని నిర్మించాలి

● మానవ హక్కుల పరిరక్షణ కార్యకర్త శివలింగం



ర్యాలీలో పాల్గొన్న సురుపంగ శివలింగం

మోటకొండూర్, ఫిబ్రవరి 15: ప్రపంచంలో వివక్షలేని సమాజాన్ని నిర్మించాలని మానవ హక్కుల పరిరక్షణ కార్యకర్త సురుపంగ శివలింగం అన్నారు. గురువారం మండలకేంద్రానికి చెందిన సురుపంగ శివలింగం ఐదురోజులపాటు నేపాల్ రాజధాని కాట్మండులో జరిగే వరల్డ్ సోషల్ ఫోరం సభలో పాల్గొని మాట్లాడారు. ఇరవై సంవత్సరాలుగా వివిధ సంస్థల్లో మానవ హక్కుల పరిరక్షణకోసం పనిచేయడంతోనే కాట్మండు వెళ్లే అవకాశం వచ్చిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులతో కలిసి ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో సుమారు 300కు పైగా అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. అందులో ప్రధానంగా వివక్ష, దళిత, ఆదివాసీ, మైనార్టీ, మహిళ, పిల్లల హక్కులతోపాటు రైతు సమస్యలు, జల్, జంగల్, జమీన్, అటవీ హక్కులపై చర్చ ఉంటుందన్నారు. అదే విధంగా హింసకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

సరస్వతీ అమ్మవారికి వెండి ఆభరణాలు బహూకరణ

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 15: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలో కొలువైన శ్రీసరస్వతి దేవి అమ్మవారికి దాతలు వెండి ఆభరణాలు బహూకరించారు. కుక్కడపు రామ్మూర్తి, అతని కుమారులు కుక్కడపు సంతోష్, రాధిక, సముద్రాల మహేష్,లతలు గురువారం ఈ ఆభరణలు బహూకరించినట్లు ఆలయ ఛైర్మన్ డాక్టర్ శరత్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు రూ.3లక్షల విలువైన అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వెండి ఆభరణాలు అందించారని చెప్పారు.



సరస్వతి దేవి ఉత్సవ విగ్రహానికి బహూకరించిన వెండి తొడుగు

ప్రకృతిలో లభించే.. ప్రతీ మొక్కలోనూ ఔషధ గుణాలు

● ఆయుర్వేద సిద్ధవైద్య నిపుణుడు మనోహరస్వామి

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 15: ప్రకృతిలో లభించే ప్రతీ మొక్కలో ఔషధగుణాలు లభిస్తాయని ఆయుర్వేద సిద్ధవైద్య నిపుణుడు కాళహస్తి మనోహరస్వామి అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గురువారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఆయుర్వేదసిద్ధ వైద్యనిపుణుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని మందులు వాడినా తగ్గని రోగాలకు ప్రకృతివైద్యం ఎంతో మేలు చేస్తుందన్నారు. కంటిజబ్బులు కలిగి ఉన్న వారికి యాద్గార్‌పల్లి రోడ్డులోని శుభోదయం కన్వెన్షల్‌హాల్‌లో నేడు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయుర్వేద వైద్యులు కృష్ణంరాజు, సురేందర్‌నాయుడు, రవికుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగునాయక్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 15: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జాలుబావితండాలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన జర్పుల లింగునాయక్(30) గురువారం సాయంత్రం వ్యవసాయ మోటారుకు మరమ్మతు చేయించేందుకు పొలం వద్దకు వెళ్లాడు. మోటారుకు విద్యుత్ సరఫరా చేసే సర్వీర్‌తీగ ప్రమాదవశాత్తు తెగిమీదపడడంతో విద్యుదాఘాతానికి గురై శరీరం పూర్తికాలి అక్కడికక్కడే మృతిచెందాడు. రైతు లింగునాయక్ తనకున్న ఒక ఎకరంతోపాటు మరికొంత పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. పొట్టదశకు వచ్చిన వరిపంటకు విద్యుత్‌మోటారు ద్వారా నీరుపెట్టేందుకు వెళ్లి ప్రమాదానికి గురై మృత్యువాతపడడంతో బాధిత కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. లింగునాయక్‌కు భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. లింగునాయక్ తండ్రి భావుసింగ్ ఫిర్యాదు మేరకు రూరల్‌పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడేసిన వస్తువులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 15: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామంలో గురువారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ సతీష్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివనేని వెంకటేశ్వర్లు, లక్ష్మి దంపతులు కూలీపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దినసరికూలీకోసం ఇంటికి తాళంవేసి పనికివెళ్లారు. గమనించిన దొంగలు తాళం ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచారు. బీరువాలో ఉన్న రూ.40వేలను ఎత్తుకెళ్లారు. పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి చేరుకున్న దంపతులు ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో అక్కడకు చేరుకున్న రూరల్ పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. నల్లగొండనుంచి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

శాలిగౌరారం, ఫిబ్రవరి 15: శాలిగౌరారం మండలం పావురాలగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దాదాపు రూ.50వేల విలువైన సొమ్ములు, నగదు అపహరించుకుపోయారు. శాలిగౌరారం హెడ్ కానిస్టేబుల్ నజీర్ తెలిపిన వివరాల ప్రకారం.. పావురాలగూడెం గ్రామ శివారులో ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. దాంట్లో రూ.10వేలు, హుండీని ధ్వంసం చేసి దాదాపు రూ.15వేలు, మైక్ సెట్‌ను ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన సొత్తు దాదాపు రూ.50వేల వరకు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు గోదల వెంకట్‌రెడ్డి శాలిగౌరారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని హెడ్ కానిస్టేబుల్ నజీర్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు. గత ఆరు నెలల క్రితం కూడా ఈ ఆలయంలో చోరీ జరిగింది.

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరిపురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టే... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామలక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కంబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

● వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను ఆర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

● ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవిందరాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వనప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



● నూతి శివానందం

నేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
నేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద


"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే.. కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.

అవధూత శిఖామణి





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.


వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

జ్ఞాన కార్యసాధకుడు



● మధ్వ ప్రచార పరిషత్, 9440258841

మతమార్పిడుల నుంచి కాపాడిన సేవాలాల్



కోదాడలో మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణ

తిరుమలగిరి రూరల్, ఫిబ్రవరి 15: బంజారాలను మత మార్పిడుల నుంచి సంత్ సేవాలాల్ కాపాడారని ఎమ్మెల్యే మందుల సామేల్ కొనియా డారు. గురువారం మండలంలోని తొండ గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంజారాల హక్కుల కోసం నిజాం, మైసూరు పాలకులకు వ్యతిరేకంగా సేవాలాల్ పోరాటం చేశారన్నారు. ఆంగ్లేయులు, ముస్లిం పాలకుల ప్రభావాలకు లోనుకాకుండా, ఇతర సంప్రదాయాలకు బంజారాలు మారకుండా సేవాలాల్ ఎంతో కృషి చేశారన్నారు. బంజారాల కట్టుబాట్లు, విలక్షణ దుస్తులు, ఆభరణాలతో తమ ప్రత్యేకతలను నిలుపుకుంటూ ఒకే భాషను మాట్లాడడానికి కారణం సేవాలాల్ కృషి ఫలితమేనని అన్నారు. కార్యక్రమంలో బంజారా నాయకులు జుమ్మీలాల్, రామోజీనాయక్, రవి, రాములు నాయక్, ప్రేమ్‌కుమార్, హీరూనాయక్, కిష్టునాయక్, మోహన్ పాల్గొన్నారు.

సమాజాన్ని సంస్కరించిన వ్యక్తి సేవాలాల్

సూర్యాపేట అర్బన్: సమాజాన్ని సంస్కరించిన వ్యక్తి సేవాలాల్ అని సూర్యాపేట ఆర్డీవో సీహెచ్ కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని బంజార భవన్‌లో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ జయంతిని నిర్వహించడమే కాకుండా ఐచ్ఛిక సెలవు ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, దరావత్ వీరన్ననాయక్, పాండు నాయక్, ఎంపీపీ కుమారి బాబునాయక్, మంగ్యానాయక్, అజయ్‌నాయక్, నాగునాయక్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాట్లాడుతున్న ఆర్డీవో సీహెచ్ కృష్ణయ్య

గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

తుంగతుర్తి: గిరిజనుల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ జయంతి రోజును సెలవుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, రాంమూర్తి, సత్యనారాయణ, వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఆశయాలు సాధించాలి

హుజూర్‌నగర్: సంత్‌సేవాలాల్ ఆశయాలు సాధించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా కోట్యా, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మాలోతు నాగూనాయక్ అన్నారు పట్టణంలోని బంజాభవన్‌లో నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్వతి, కొండానాయక్, జగన్‌నాయక్, వెంకట్రామ్, నాయక్, సుజాత, సక్రూ, మధు, శ్రీను, చత్రునాయక్, తులసిరామ్, నాగు, బాణోతు వెంకటేశ్వర్లు, సుధాకర్, నాగేశ్వరరావు, చింటు, రవీందర్, పాండు, బాలు, రవి పాల్గొన్నారు.

పాలకవీడు: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని పాలకవీడు మండలంలోని పలు తండాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోపాల్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి వేడుకకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై గిరిజనులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య, డీసీఎల్ సీజీఎం నాగమల్లేశ్వరరావు, మోతీలాల్, సైదానాయక్ పాల్గొన్నారు.



తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేలు

గిరిజనుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన సేవాలాల్

కోదాడ టౌన్: గిరిజనుల కోసం సేవాలాల్ తన జీవితాన్ని త్యాగం చేశారని ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. కోదాడలో ప్రభుత్వ పరంగా సేవాలాల్ జయంతి నిర్వహించి మాట్లాడారు. గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కృషిచేస్తానన్నారు.ఈ సందర్భంగా గిరిజన నాయకులు, పలువురు ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నృత్య రూపకాలు ప్రదర్శించారు. గిరిజన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల రమేష్, ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, ఎంఈవో సలీంషరీఫ్, సైదానాయక్, హాజి నాయక్, హనుమనాయక్, నందలాల్ పాల్గొన్నారు.

'దళితబంధు' అవినీతిపై విచారణ జరిపించాలి

తిరుమలగిరి, ఫిబ్రవరి 15: పైలెట్ 'దళితబంధు'ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తిరుమలగిరి మండలంలో రూ.100కోట్ల అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే సామేల్ కోరారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ పేరుతో ఒక్కో 'దళిత బంధు' లబ్ధిదారుడి నుంచి రూ.3లక్షల నుంచి రూ.4లక్షలు వసూలు చేసి, ఆ డబ్బును ప్రభుత్వానికి చెల్లించకుండా కోట్లు గడించారన్నారు. దీనిపై విచారణ జరిపించాలని అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్లారు.

సీఎంకు ఎమ్మెల్యే సామేలు కృతజ్ఞతలు

తిరుమలగిరికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే సామేల్ కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలుపుకోలేకపోయిందని, సమస్య విన్నవించిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా మునిసిపల్ కేంద్రంలోని ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను బీటెక్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని అసెంబ్లీలో ఆయన కోరారు.

నేడు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 15: దేశవ్యాప్త బంద్ సందర్భంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి బీవీ రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం నిర్వహిస్తున్న ఖరీదుదారులు, కమీషన్‌దారులు, కార్మిక సంఘాల వినతి మేరకు మార్కెట్‌కు సెలవు ప్రకటించామన్నారు. మార్కెట్‌కు రైతులు శుక్రవారం ఎలాంటి ఉత్పత్తులను తీసుకురావద్దని ఆయన సూచించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

తిరుమలగిరి రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని తొండ గ్రామంలో గ్రామ పంచాయతీకి కేటాయించిన భూములకు హద్దురాళ్లు పాతి ఆ భూమిని రక్షించాలని గ్రామాభ్యుదయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షులు బైరెడ్డి ఏసిరెడ్డి మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్లాట్లను కొంతమంది విక్రయించారని, ఈ భూమికి హద్దు రాళ్లు పాతనట్లయితే, ప్లాట్లను విక్రయించే ప్రమాదం ఉందన్నారు. వెంటనే హద్దురాళ్లు పాతాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు యాదగిరి, ముత్తయ్య, బాలరాజు, చంద్రయ్య, సైదులు, భాస్కర్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తుంగతుర్తి, ఫిబ్రవరి 15: తుంగతుర్తి సీఐగా డి.శ్రీను గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన బ్రహ్మమురారి బదిలీ అయ్యారు. డీఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీను బదిలీపై తుంగతుర్తికి వచ్చారు.

పాలకవీడు: ఎంపీడీవోగా లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా నల్లగొండ నుంచి పాలకవీడుకు వచ్చినట్లు తెలిపారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఎంపీపీ గోపాల్ ఆధ్వర్యంలో ఎంపీడీవోను సన్మానించారు. కార్యక్రమంలో మోతీలాల్, నాగమల్లేశ్వరరావు, దయాకర్, రాజు, పిచ్చయ్య తదితరులు పాలొన్నారు.

మునగాల: మునగాల సీఐగా రామకృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కోదాడ రూరల్ సీఐగా పనిచేసి బదిలీపై మునగాలకు వచ్చారు. ఇప్పటివరకు మునగాల సీఐగా పనిచేసిన వీరరాఘవులు సూర్యపేట సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

బీజేపీ విజయసంకల్ప సభ 21న

తుంగతుర్తి, ఫిబ్రవరి 15: తుంగతుర్తిలో ఈనెల 21వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయసంకల్ప సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సంకల్ప యాత్ర తుంగతుర్తి ఇన్‌చార్జి గొంగిడి మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రారంభమైన బీజేపీ విజయసంకల్ప యాత్ర ఈనెల 21న తుంగతుర్తికి చేరుకుంటుందన్నారు. ఈ సభను నియోజకవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా, తుంగతుర్తి కన్వీనర్ కాప రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, రాంబాబు, గాజుల మహేందర్, చిరంజీవి, శంకర్, సాగర్, బంగారు రాజు, రమేష్ పాల్గొన్నారు.

టీటీడీ కల్యాణ మండపాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 15: టీటీడీ కల్యాణ మండపాన్ని సద్వినియోగం చేసుకోవాలని పైడిమర్రి నారాయణరావు, పందిరి సత్యనారాయణ, గరిణె శ్రీధర్, కొండపల్లి వాసు, కుక్కడపు బాబు అన్నారు. ఆధునికీకరించిన టీడీడీ కల్యాణ మండపాన్ని గురువారం కోదాడలోని హుజూర్‌నగర్ రోడ్డులో నిర్వాహకుడు జగని ప్రసాద్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ కల్యాణ మండపం అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని, కోదాడ పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కల్యాణ మండపంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

24 నుంచి లక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర



జాతర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 15: మండలంలతోని చీదెళ్ల గ్రామంలో లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వాముల జాతరను ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర పోస్టర్లు, కరపత్రాలను గురువారం పెన్‌పహాడ్‌లో ఆలయ కమిటీ చైర్మన్ మోతుగు నర్సిరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం అమృతరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు బీజిగా గోపి, అనంతుల అంజయ్య, దేశగాని రాజు, గొట్టిపర్తి గోపయ్య, రవీందర్ రెడ్డి, జాల సైదులు, జూలకంటి రాజశేఖర్ రెడ్డి, కీర్తి వెంకట్రావ్, కొండమీది గోపి, కీర్తి యలమంచయ్య, వేణు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, ఫిబ్రవరి 15: మట్టపల్లి క్షేత్రంలో గురువారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయంలో పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు పాల్గొన్నారు.

రైతులపై చర్యలు సిగ్గుచేటు

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15: రైతులపై కేంద్ర ప్రభుత్వం టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లు ప్రయోగించడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాసు అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. రైతులపై రబ్బర్ బుల్లెట్ల వర్షం కురిపించిన మోదీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. సమావేశంలో కొప్పోజు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు: ఎంపీడీవో

కోదాడ రూరల్, ఫిబ్రవరి 15: రానున్న వేసవికాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో, దోరకుంట గ్రామ ప్రత్యేక అధికారి వెంకటరామచంద్రరావు తెలిపారు. మండలంలోని ద్వారకుంట గ్రామంలో తాగునీటి సమస్య ఉన్నందున మిషన్ భగీరథ అధికారులతో గురువారం మాట్లాడి వాటర్ ట్యాంకులకు భగీరథ పైప్‌లైన్లను అనుసంధానం చేసి సమస్యను పరిష్కరించారు. అనంతరం దోరకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో కార్యదర్శి జీవిత, గ్రామస్థులు షేక్ జబ్బార్, మధుబాబు, సురేష్, శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మునగాల రూరల్, ఫిబ్రవరి 15: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీటీసీ సోమపంగు మోహన్, కాంగ్రెస్ రేపాల గ్రామ శాఖ అధ్యక్షుడు వరికల రమేష్ అన్నారు. ఎమ్మెల్యే పద్మావతి నిధులు రూ.10 లక్షలతో రేపాల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి గురువారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పనస విజయ్, మొగిచెర్ల రాజేష్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గండు జితేందర్, శివాలయం చైర్మన్ మెరుగు ముత్తయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ధర్మభిక్షంను ఆదర్శంగా తీసుకోవాలి



సూర్యాపేటలో ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ నాయకులు

సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 15: పార్లమెంట్ మాజీ సభ్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. ధర్మభిక్షం జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ధర్మభిక్షం విద్యార్థి నాయకుడిగా, కార్మిక నాయకుడిగా, మూడు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు ఎంపీగా పనిచేశారన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మండారి డేవిడ్‌కుమార్, అనంతుల మల్లీశ్వరి, బైరు వెంకన్నగౌడ్, ఏల్గూరి గోవింద్‌గౌడ్, కక్కిరేణి సత్యనారాయణ, బూర బాలసైదులుగౌడ్, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, పల్స వెంకన్న, దంతాల రాంబాబు, బొమ్మగాని శ్రీనివాస్, బూర వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు, నిమ్మల ప్రభాకర్, ఖమ్మంపాటి రాము, రేగటి లింగయ్య, పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: తెలంగాణ సాయుధపోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం సాధించాలని గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పాలకూరి అన్నారు. పట్టణంలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణ, సైదులు, పాపులు, వెంకటేశ్వర్లు, వెంకటేష్, విజయ్, లక్ష్మమ్మ, యశోద, పిచ్చమ్మ, మల్లమ్మ, స్వరూప పాల్గొన్నారు.

చిలుకూరు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కాటమయ్య దేవాలయం వద్ద ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాంబాబు, గీతపనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా కోటయ్య పాల్గొన్నారు.

తుంగతుర్తి: ధర్మభిక్షం జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకమని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి గుగులోతు రాజారాం అన్నారు. తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో బొంకూరి రమేష్, వెంకన్న, సైదులు, రాకేష్, లక్ష్మయ్య, మల్లేష్, నాగరాజు పాల్గొన్నారు.

విజయవంతంగా మాక్ పోలింగ్: కలెక్టర్

సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎఫ్ఎల్‌సీని, మాక్ పోలింగ్‌ను విజయవంతంగా చేపట్టామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంలో చేపట్టిన మాక్‌పోలింగ్‌ను అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలసి గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 5వ తేదీ నుంచి ఎఫ్ఎల్‌సీ, మాక్ పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈసీఎల్ ఇంజనీర్లు, రెవెన్యూ సిబ్బంది సేవలను ఎఫ్ఎల్‌సీలో సద్వినియోగం చేసుకున్నామన్నారు. మొత్తం వీవీప్యాట్స్ 1847, బీయూలు 2689, సీయూలు 1736 ఎఫ్ఎల్‌సీ చేపట్టామని వివరించారు. మాక్ పోలింగ్‌లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో 1200 ఓట్లకు 75 రౌండ్లకు 2శాతం, 1000ఓట్లకు 64 రౌండ్లకు ఒక శాతం, అలాగే 500 ఓట్లక 32 రౌండ్లకు ఒకశాతం మాక్ పోలింగ్ నిర్వహించి ముగించామన్నారు కార్యక్రమంలో ఆర్డీవోలు కృష్ణయ్య, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ, తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



: ఈవీఎంల గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

నేటి భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



సూర్యాపేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 15: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండాది డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సూర్యాపేటలో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

సూర్యాపేటఅర్బన్: భారత్‌బంద్ ను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, సయ్యద్, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో పోస్టర్లను సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న ఆవిష్కరించారు. తదనంతరం ప్రచారం చేశారు. కార్యక్రమంలో అబ్బగాని భిక్షం, బండారి సైదులు, నాగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: దేశ వ్యాప్తంగా నేడు చేపట్టనున్న కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పట్టణంలో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. కార్యక్రమాల్లో యల్లావుల రాములు, కంబాల శ్రీనివాసు పాల్గొన్నారు.

చిలుకూరు: దేశవ్యాప్తంగా బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య కోరారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ముక్కా వీరబాబు, పుట్టపాక అంజయ్య తదితరులున్నారు.

తిరుమలగిరి: బంద్‌లో అందరూ పాల్గొనాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు కోరారు. తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కడెం లింగయ్య, ఉప్పలయ్య, వనం సోమయ్య, నర్సింహ పాల్గొన్నారు.

కోదాడ రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని పౌర సరఫరాల శాఖ హమాలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. . కార్యక్రమంలో కొండలు, శ్రీనివాస్, గౌరీనాయుడు, గోవిందు పాల్గొన్నారు.

నూతన్‌కల్: గ్రామీణ బారత్ బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్షాల నాయకులు తొట్ల ప్రభాకర్‌గౌడ్, కందాళ శంకర్‌రెడ్డి, దేశోజు మధు కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.



బస్సు సౌకర్యం లేకపోవటంతో ఆటోలో వెలుతున్న ప్రయాణికులు

రోడ్డు సౌకర్యం ఉన్నా రాని బస్సులు

మఠంపల్లి: తండాల నుంచి పనుల నిమిత్తం మఠంపల్లి, హుజూర్‌నగర్ తదితర ప్రాంతలకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం లేక రెండు, మూడు కిలో మీటర్ల దూరం కాలినడక వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని గుర్రంబోడుతండా, కృష్ణాతండా, భీమ్లాతండా, రామచంద్రాపురంతండా, భోజ్యతండాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధుల పరిస్థితి దారుణం. కనీసం మూడు కిలోమీటర్లు నడిస్తేకాని బస్సు ఎక్కలేని పరిస్థితి. రోడ్డు సౌకర్యం సరిగా లేదనే శస్త్రధణజసాకుతో ఐదు సంవత్సరాల క్రితం ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు నిలిపివేశారు. పరిస్థితులు మారి రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సర్వీసులు నడపకపోవటంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



గతంలో మా తండాల మీదుగా బస్సు వచ్చేది. రోడ్డు బాగలేదని అధికారులు బస్సు సర్వీసు రద్దు చేశారు. అధికారులకు పలుమార్లు వినవించినా పట్టుచుకోవడం లేదు. రోడ్డు బాగుపడ్డా తండాలకు బస్సులు రావడంలేదు. విద్యార్థులు, ప్రయాణికులు, వృద్ధులు కాలినడక వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మట్టపల్లి వైపు వచ్చే బస్సులను తండాల మీదుగా వచ్చేలా బస్సు సౌకర్యం కల్పించాలి.

- మాలోతు భీముడునాయక్, మాజీ సర్పంచ్ రామచంద్రాపురంతండా



ఆత్మకూర్(ఎస్): మండలంలోని మక్తా కొత్త గూడెం గ్రామానికి చెందిన బండారి వీరబాబు-కీర్తిల కుమార్తె యక్షిత పుట్టిన రోజు సందర్భగా ఆ గ్రామంలో పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో అందజేయడంతో పాటు పరీక్ష ప్యాడ్లు, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ తిప్పర్తి భిక్షం, గడ్డం నాగరాజు, కాసాని ప్రవీణ్, బండారి మహేష్, బత్తుల రామకృష్ణ, మహేష్, పాల్గొన్నారు

చివ్వెంల: మండల కేంద్రంలోని గుంజలూరు గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ కార్యకర్త మెలుగూరి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుంకరి ఉపేందర్, పెద్ది అంజయ్య పాల్గొన్నారు.

నేరేడుచర్ల: పట్టణంలోని పినాకిల్ పాఠశాలలో సంస్కృతి పేరుతో కళా ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మదార్ పాల్గొన్నారు.

● నేరేడుచర్ల మునిసిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లు వీడ్కోలు సమావేశాన్ని పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్‌పర్సన్ సరిత, కౌన్సిలర్లు సన్మానించారు.

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన చరమందరాజును, ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ముత్తయ్యను కాంగ్రెస్ పార్టీ నాయకులు మధిర ప్రతాప్‌రెడ్డి, దాసా నాగేశ్వరరావు, నలబోలు వెంకటరెడ్డి, అంజనపల్లి సుదర్శన్ సన్మానించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

● సీఎం రేవంత్‌రెడ్డిని హుజూర్‌నగర్‌కు చెందిన ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు యరగాని నాగన్నగౌడ్ హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డీ చంద్రశేఖర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ముత్తయ్య హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బలరామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని శాంతినగర్ గ్రామం ఒకటో వార్డులో నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీలను నిర్మిస్తున్నారని ఆ గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ మండల కార్యదర్శి బద్దం కృష్ణారెడ్డి ఆరోపించారు. విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆక్రమించిన స్థలాలను వదిలి డ్రైనేజీలను నిర్మించడం సరికాదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసిన తర్వాతే శాశ్వత డ్రైనేజీ కాలువలను నిర్మించాలని ఆయన కోరారు.

395 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● ఖమ్మం నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా స్వాధీనం ● ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగిస్తే పీడీయాక్టు : ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటక్రైం, చిలుకూరు, ఫిబ్రవరి 15: సూర్యాపేట పట్టణ పోలీసులు, రెవెన్యు అధికారులు కలిసి అక్రమంగా తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.12లక్షల వరకు ఉంటుంది. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే వివరాలు వెల్లడించారు. ఈ నెల 13వ తేదీన చివ్వెంల మండలం చందుపట్లలో ఓ లారీని తనిఖీ చేస్తుండగా 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ లారీలోని బియ్యం కోదాడ పట్టణానికి చెందిన షేక్ మీరా అలీకి చెందినవిగా చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి నుంచి హైదరాబాద్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. పట్టణ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కూసుమంచికి వెళ్లి తనిఖీ చేయగా షేక్ మీరా అలీకి చెందిన మరో మూడు వాహనాల్లో సుమారు 100 క్వింటాళ్ల బియ్యం రవాణాకు సిద్ధంగా ఉంది. ఆ వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిత్యవసరాల వస్తువుల దుర్వినియోగం, చీటింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టుచేశారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే పీడీయాక్టు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది కరుణాకర్, కృష్ణ పాల్గొన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

చిలుకూరు పరిధిలో 95 క్వింటాళ్ల స్వాధీనం

చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో రెండు ఇళ్లలో నిల్వ చేసిన 95 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామశివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల మధ్య 122 బస్తాల్లో నిల్వ చేసిన 55 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని బెజవాడ సైదులుపై కేసు నమోదు చేశారు. అదేవిధంగా అక్కడే సమీపంలో ఉన్న బోళ్ల నర్సమ్మ ఇంట్లో నిల్వచేసిన 40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇంటిని కిరాయికి తీసుకొని అక్రమ పీడీఎస్ బియ్యం వ్యాపారం చేస్తున్న బెజవాడ లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశారు.